

టన్ను చీనీ రూ.26 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.26 వేలు, కనిష్టంగా రూ.10 వేలు పలికాయి.



కిలో టమాట రూ.15

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.15, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.11 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
29.8°/ 12.7°

జిల్లా పరిధిలో బుధవారం తుపాను వాతావరణం నెలకొంది. చలి తీవ్రత స్వల్పంగా తగ్గింది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ప్రకృతి వ్యవసాయంపై విస్తృత అవగాహన



ప్రకృతి వ్యవసాయంపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్‌హాలులో 'వ్యవసాయ అనుబంధ రంగాలు 15 శాతం వృద్ధి రేటు లక్ష్యం' అనే అంశంపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే మూడు నెలలు లక్ష్యాలను సాధించడానికి ఆయా శాఖల ఆధ్వర్యంలో మండల, డివిజన్ వారీగా నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించాలన్నారు. వ్యవసాయ సాంకేతిక వినియోగంపై రైతులను చైతన్యవంతులను చేయాలన్నారు. కౌలు రైతులకు మరింత మేలు జరిగేలా అందరితో సూచనలు, సలహాలు తీసుకుని నూతన కౌలు చట్టం అమలుకు సహకరించాలన్నారు. 32 మండలాల వ్యవసాయ నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మండలాల వారీగా ఎరువుల దుకాణాలు, వాటి పనితీరు, మినీ గోకులాల మంజూరు వాటి నిర్మాణాల పురోగతిపై నివేదికలు సమర్పించాలన్నారు. కౌలు రైతులకు రుణాల మంజూరు, పశువుల పెంపకం క్రెడిట్ కార్డులు, పశు గణన, సీసీఆర్సీ కార్డుల మంజూరు వంటి అంశాలపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, హార్టికల్చర్ అధికారి చంద్రశేఖర్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, సెరికల్చర్ అధికారి పద్మావతమ్మ, మత్స్య శాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ జేడీ శుభదాస్, కోఆపరేటివ్ అధికారి నాయక్, ప్రకృతి వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

21న ప్రాజెక్ట్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు

ప్రశాంతి నిలయం: జిల్లా స్థాయిలో మూడు మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టు కమిటీలకు చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలకు ఈ నెల 21న ఎన్నికలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ చేతన్ తెలిపారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో ప్రాజెక్ట్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాధాకృష్ణ, డీఈ గంగాద్రి, ఏఈ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

బాబయ్యస్వామి సేవలో ఉషశ్రీచరణ్



చాదర్ తీసుకొస్తున్న ఉషశ్రీచరణ్

పెనుకొండ రూరల్: గంధం–ఉరుసు సందర్భంగా బుధవారం పెనుకొండ బాబయ్యస్వామి దర్గాను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ సందర్శించారు. ఈ సందర్భంగా స్వామికి చాదర్ సమర్పించారు. మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ ఫక్రుద్దీన్, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు సద్దాం, తయ్యాబ్, శేషాద్రి, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ నరసింహులు, నాయకులు బాబు, గణేష్, శ్రీరాములు, యాసిన్, కిష్టప్ప, కొండలరాయుడు, శ్రీకాంత్‌రెడ్డి, నాగళూరు ప్రభాకర్‌రెడ్డి, నారాయణస్వామి, నారాయణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

టీచర్ షఫీవుల్లా సస్పెన్షన్

పుట్టపర్తి: షేర్ మార్కెట్ పేరిట తమతో డబ్బులు కట్టించి మోసం చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న పరిగి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు షేక్ మహమ్మద్ షఫీవుల్లా సస్పెండ్ అయ్యారు. షఫీవుల్లా తమను షేర్ మార్కెట్ పేరుతో మోసం చేశారని అనంతపురానికి చెందిన రామ లక్ష్మిరెడ్డి అనే వ్యక్తి గత నెల 11వ తేదీన 4వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో డీఈఓ కృష్ణప్ప సదరు టీచర్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు బుధవారం తెలిపారు.

ట్రామా.. కోమా!



- గుట్టూరు సమీపంలో రెండు నెలల క్రితం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. క్షతగాత్రులను అనంతపురం తరలించే లోపు మార్గం మధ్యలో మరణించారు. పెనుకొండలో ట్రామా కేర్ అందుబాటులో ఉండి ఉంటే బతికే అవకాశం ఉండేది.
- మామిళ్లపల్లి నుంచి పెనుకొండ వైపు వెళ్తున్న ఓ 17 ఏళ్ల కుర్రాడు చెన్నేకొత్తపల్లి దాటిన తర్వాత అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని బెంగళూరుకు తీసుకెళ్తుండగా కొడికొండ చెక్‌పోస్టు దాటిన తర్వాత పరిస్థితి విషమించి చనిపోయాడు.
- గడిచిన ఆరు నెలల వ్యవధిలో పెనుకొండ చుట్టుపక్కల 72 రోడ్డు ప్రమదాలు జరిగాయి. అందులో ఆరుగురు చనిపోయారు. మరో 14 మంది తీవ్రంగా, 63 మంది స్వల్పంగా గాయపడ్డారు.



- జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు
- వైద్యం అందక ఎందరో మృత్యువాత
- పెనుకొండలో పని చేయని ట్రామా కేర్
- నిపుణులు లేక నిరుపయోగం
- మందుల నిల్వ కేంద్రంగా వాడకం

సాక్షి, పుట్టపర్తి : జాతీయ రహదారులు రక్తమోడుతున్నాయి. ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. మరెంతో మంది క్షతగాత్రులుగా మారి మంచానికి పరిమితమవుతున్నారు. అత్యవసర సమయాల్లో వైద్యం అందక ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ప్రమాదాలు జరిగిన వెంటనే అత్యవసర చికిత్స అందించాలనే ఉద్దేశంతో పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ట్రామా కేర్‌ను 2016లో ప్రారంభించారు. ఆ తర్వాత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం భవనం రెండో అంతస్తును 'నాడు – నేడు' కింద మరింత అభివృద్ధి చేసింది. అయితే సరైన నిపుణులు లేరనే సాకు చెబుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ భవనాన్ని మందుల నిల్వ చేసే స్టోర్‌రూమ్‌గా వినియోగిస్తోంది. ట్రామా బోర్డు కూడా తొలగించారు.

సర్కారు తీరుపై విమర్శలు..

జాతీయ రహదారిపై ప్రమాదాల నేపథ్యంలో పెనుకొండ ప్రభుత్వాస్పత్రి ఆవరణలో 2016లో అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ ట్రామా కేర్‌ను ప్రారంభించారు. అయితే అప్పట్లో వైద్యులను నియమించలేదు. అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ట్రామాకేర్ అభివృద్ధికి కృషి చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పరికరాల ఏర్పాటుకు, సిబ్బంది నియామకానికి ఇంకా చర్యలు చేపట్టలేదు. దీనికితోడు భవనాన్ని ట్రామా కేర్ నుంచి మెడిసిన్ స్టోరేజ్‌గా మార్చడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

గాల్లోకి ప్రాణాలు..

ప్రమాదాలు జరిగిన వెంటనే అత్యవసర చికిత్స చేస్తే ఎంతోమంది బతికే అవకాశం ఉంటుంది. అయితే తీవ్రంగా గాయపడిన వారిని పెనుకొండ సమీపం నుంచి అనంతపురం తీసుకెళ్లే లోపు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి ఘటనలే ఎక్కువగా వెలుగు చూశాయి. అయితే ట్రామా కేర్‌ను మరింత అభివృద్ధి చేసి వినియోగంలోకి తేవడం మరిచి.. స్టోరేజీ పాయింట్‌గా వాడుకునేందుకు కసరత్తు చేస్తుండటం సరి కాదని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



పెనుకొండలో ట్రామా కేర్ భవనం

ట్రామాకేర్ సేవలు ప్రారంభించాలి



పెనుకొండ సమీపాన కియా కార్ల పరిశ్రమ రాకతో వాహనాల రాకపోకలు పెరిగాయి. ఫలితంగా జన రద్దీ పెరిగింది. దీనికి తోడు ప్రస్తుతం పొగమంచు కప్పుకొస్తోంది. నిత్యం జాతీయ రహదారిపై ఏదో చోట ప్రమాదం చోటు చేసుకుంటోంది. అయితే సకాలంలో వైద్యం అందక చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. ట్రామా కేర్‌ను వినియోగంలోకి తేవాలి. – హరి, సీపీఎం డివిజన్ కార్యదర్శి, పెనుకొండ

పరికరాలు రాలేదు

ప్రభుత్వాస్పత్రిలో ట్రామాకేర్ భవనం ప్రారంభించినప్పటికీ అవసరమైన ఎక్విప్‌మెంట్ (పరికరాలు) రాలేదు. ఈ విభాగానికి సంబంధించి వైద్య నిపుణులు, సిబ్బందిని ప్రత్యేకంగా నియమించలేదు. ట్రామాకేర్ సమస్యల గురించి స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారు ప్రభుత్వానికి విన్నవిస్తామని చెప్పారు.
– మోహన్‌నాయక్, సూపరింటెండెంట్, పెనుకొండ ప్రభుత్వ వైద్యశాల

భూ కబ్జాపై ఆర్డీఓ విచారణ



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నార్శింపల్లి తండావాసులు

సాక్షి ఎఫెక్ట్..

పుట్టపర్తి అర్బన్: బుక్కపట్నం మండలం నార్శింపల్లి గిరిజన కాలనీలో ప్రభుత్వ భూమి కబ్జా చేసి.. అక్రమంగా పట్టా పొందిన ఘటనపై పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ బుధవారం విచారణ చేపట్టారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత బుక్కపట్నం మండలంలో టీడీపీ నాయకులు రెచ్చిపోయి అక్రమాలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో 'పేదల గూడుపై 'పచ్చ' నీడ' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆర్డీఓ స్పందించి.. బుక్కపట్నం తహసీల్దార్ షాబుద్దీన్‌ను తన కార్యాలయానికి పిలిపించి ఆరా తీశారు. పూర్తి నివేదికను గురువారం కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఆర్డీఓ తెలిపారు.

అక్రమ పట్టా రద్దు చేస్తామన్న తహసీల్దార్..

పుట్టపర్తి: నార్శింపల్లి తండా గిరిజన కాలనీ భూమికి కొత్తకోట గ్రామానికి చెందిన నగరి రాజేష్ పేరిట అక్రమంగా ఇచ్చిన పట్టాను రద్దు చేసి, రికార్డుల నుంచి తొలగించాలని తండావాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం సచివాలయ ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో తహసీల్దార్ షాబుద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎన్నో ఏళ్ల నుంచి నివాసాలున్న సర్వే నంబర్ 1030–2వ లెటర్‌లో 4.0900 ఎకరాల భూమి టీడీపీ నేత రాజేష్ పేరు మీద పట్టా ఎలా ఇస్తారని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. రద్దు పరచకపోతే కలెక్టరేట్ ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు. కాలనీ భూమికి పట్టా ఇచ్చి వన్‌బీ ఇవ్వటంలో తన ప్రమేయం లేదని, కార్యాలయంలో పొరపాటు జరిగిందని తహసీల్దార్ బదులిచ్చారు. పట్టా రద్దు చేస్తామని చెప్పారు. నార్శింపల్లి సర్పంచ్ భాస్కర్‌నాయక్, సుధాకర్‌నాయక్ తదితరులు తహసీల్దార్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

పెనుకొండలో కిడ్నాప్‌ల కలకలం

- ఆరు నెలల్లో ఇద్దరు చిన్నారుల అదృశ్యం
- కిడ్నాప్ ముఠా పనేనా..?



అదృశ్యమైన షఫియ



అహ్మద్ ఆల్మన్



పెనుకొండ: ఆధ్యాత్మిక కేంద్రం పెనుకొండ బాబయ్య దర్గా సమీపంలో చిన్నారుల కిడ్నాప్ కలకలం రేపుతోంది. ఆరు నెలల వ్యవధిలో ఇద్దరు చిన్నారులు అదృశ్యమవడం స్థానికులను, బాబయ్యస్వామి భక్తులను కలవర పెడుతోంది. ఈ ఏడాది జూన్ 12న దర్గా సమీపంలోని హోటల్ నిర్వాహకుడు ఖలీల్ కూతురు నాలుగేళ్ల షఫియ ఆడుకుంటున్న సమయంలో అదృశ్యమైంది. ఈ కేసును అప్పటి ఎస్‌ఐ రమేష్‌బాబు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిందితులను గుర్తించేందుకు తీవ్రంగా శ్రమించారు. హిందూపురం, బెంగళూరుపై ఫోకస్ పెట్టి గాలించారు. సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేసినా ప్రయోజనం లేకపోయింది. తాజాగా ఈ నెల 17న అహ్మద్ ఆల్మన్ అనే మరో నాలుగేళ్ల చిన్నారి అదృశ్యం కావడం సంచలనంగా మారింది.

కిడ్నాప్ ముఠా హస్తం ఉందా?

దర్గా సమీపంలో జరుగుతున్న చిన్నారుల అదృశ్యం వెనుక చిన్నారుల కిడ్నాప్ ముఠా హస్తం ఉందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చిన్నారులు ఏడవకుండా మత్తు మందు ఇచ్చి పకడ్బందీగా ఎత్తుకెళ్తున్నారా అన్న కోణంలోనూ పోలీసులు విచారణ చేస్తున్నారు. పిల్లలతో భిక్షాటన చేయించి సొమ్ము చేసుకునే ముఠా వారు ఇలాంటి కిడ్నాప్‌లకు ఏమైనా పాల్పడ్డారా అన్న సందేహాలూ వ్యక్తమవుతున్నాయి.

నిఘా నేత్రాలు లేకే నేరాలు..

బాబయ్య దర్గా బయట సీసీ కెమెరాలు లేకపోవడం చిన్నారుల అదృశ్యానికి.. ఇతర నేరాలు జరగడానికి కారణంగా పలువురు పేర్కొంటున్నారు. పవిత్ర బాబయ్య స్వామి దర్గాను దర్శించుకోవడానికి అనేక ప్రాంతాల నుంచి భక్తులు రావడం పరిపాటి. వచ్చిన భక్తులు ఆలయం ఆవరణ, సమీప షెడ్డులో తలదాచుకోవాల్సి వస్తోంది. నిత్యం జనసందోహం ఉండడంతో చిన్నారులు ఆడుకోవడానికి వెళ్లి అదృశ్యం కావడంతో కనీస సమాచారం కూడా లభ్యం కావడం లేదు.

గాలింపు కొనసాగుతోంది



బాబయ్య ఉరుసులో మంగళవారం అదృశ్యమైన అహ్మద్ ఆల్మన్ (4) ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. అనుమానితులను ఆరా తీస్తున్నాం. దర్గా ప్రాంతంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపడతాం. – వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం



ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కంబాల నరసింహస్వామికి జ్యోతులు తీసుకెళ్తున్న భక్తులు

మడకశిరరూరల్: భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో బుధవారం జిల్లెడుగుంట ఆంజనేయస్వామి దేవాలయం నుంచి కంబాల నరసింహస్వామి దేవాలయం వరకు ఉత్సవమూర్తుల ఊరేగింపు, జ్యోతుల ఉత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. భక్తరపల్లిలోలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శయనోత్సవం నిర్వహించారు. భక్తులకు ప్రసాద వినియోగం చేశారు. దేవదాయ శాఖ అధికారులు, రథోత్సవ కమిటీ సభ్యులు, భక్తులు సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు వసంతోత్సవం..

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో ముగింపు సందర్భంగా గురువారం వసంతోత్సవం, చక్రస్నానం నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ అధికారులు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



షాట్‌పుట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎస్పీ రత్న



జెండా ఊపి పరుగు పోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న

- అట్టహాసంగా పోలీస్ స్పోర్ట్స్ మీట్
- వివిధ క్రీడల్లో పోటీల నిర్వహణ

పుట్టపర్తి టౌన్: క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న పేర్కొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే పోలీస్ స్పోర్ట్స్ మీట్ -2024 పోటీలు బుధవారం పుట్టపర్తిలోని పరేడ్ మైదానంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కలెక్టర్, ఎస్పీ క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలు ప్రారంభించారు. అనంతరం శాంతి కపోతాన్ని, బెలూన్లను ఎగురవేసి పోలీస్ మార్చ్‌ఫాస్ట్ ద్వారా గౌరవ వందనం స్వీకరించారు. ఐదు సబ్‌డివిజన్ల నుంచి 8 విభాగాల్లో పాల్గొనేందుకు 150 మంది క్రీడాకారులు వచ్చారు. కలెక్టర్, ఎస్పీ ఫుట్‌బాల్ విసిరి క్రీడలను లాంఛనంగా ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న పోలీస్ క్రీడాకారుల కోసం పండుగ వాతావరణంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. నిజ జీవితంలో క్రీడలు వ్యాయామంలాగా అలవాటు చేసుకోవాలన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. పోలీసులు సమన్వయంతో పనిచేయడానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి..

పోలీసులు తమ దైనందిన జీవితంలో విధిగా క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ రత్న సూచించారు. ఉద్యోగరీత్యా ఎదురయ్యే సవాళ్లను అధిగమించాలంటే క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడాకారులకు గెలుపోటములు సర్వసాధారణమని, రెండింటినీ సమానంగా తీసుకోవాలన్నారు. క్రీడల నిజ జీవితంలో ఎంతో ఉపయోగపడతాయని, నేడు పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న వారు క్రీడల్లో మంచి ప్రతిభ కనబరచి స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగంలో చేరిన వారేనన్నారు. క్రీడల్లో మంచి ప్రతిభ కనబరచి రాష్ట్ర, దేశస్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, డీఎస్పీలు విజయకుమార్, మహేష్, ఆదినారాయణ, శ్రీనివాసులు, ఎస్‌బీ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఆర్‌ఐలు వలి, రవికుమార్, ఆర్‌ఎస్‌ఐలు వీరన్న, ప్రదీప్ సింగ్, వెంకటేశ్వర్లుతో పాటు అన్ని సబ్ డివిజన్ల పోలీసులు పాల్గొన్నారు.

సర్కార్ పగ.. చిరుద్యోగులు దగా

- ఎంపీహెచ్ఏలను రోడ్డు పాలు చేసిన కూటమి ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 58 మంది ఎంపీహెచ్ఏల తొలగింపు
- 22 ఏళ్లుగా వైద్య ఆరోగ్య శాఖలో వివిధ రకాల సేవలు
- సగం జీవితం పూర్తయిన తామెలా బతికేదంటూ ఆవేదన


తొలగింపు ఉత్తర్వులు చూపుతున్న ఎంపీహెచ్ఏలు

పుట్టపర్తి అర్బన్: ఉద్యోగాల కల్పన మాట ఎలా ఉన్నా... ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టి చిరుద్యోగుల నెత్తిన కూటమి సర్కార్ భస్మాసుర హస్తాన్ని మోపింది. వైద్య శాఖలో పనిచేస్తున్న మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ల (ఎంపీహెచ్ఏ-మేల్)ను ఉన్నఫలంగా తొలగించి రోడ్డు పాలు చేసింది. వైద్య శాఖను నిర్వీర్యం చేసే ఈ కుట్రలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తొలి విడతలో 58 మంది బలయ్యారు.

అగమ్యగోచరమైన జీవితాలు..

ఉమ్మడి జిల్లాలో 143 మంది ఎంపీహెచ్ఏ (మేల్)లు పనిచేస్తుండగా వీరిలో 58 మందిని ఎలాంటి కారణాలు చూపకుండా ప్రభుత్వం తొలగించింది. దీంతో ప్రభుత్వ ఉద్యోగాన్ని నమ్ముకున్న వారి కుటుంబాల జీవనం అగమ్యగోచరంగా మారింది. కుటుంబసభ్యుల పోషణ, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల బాగోగులు, పిల్లల విద్య, ఇంటి అద్దెలు ఎలా చెల్లించాలో తెలియక తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం తొలగించిందనే విషయం బహిర్గతం కాగానే కనీసం అప్పులు కూడా పుట్టడం లేదు. ఇదే విషయాన్ని ఇటీవల రాష్ట్ర మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లి పలువురు కన్నీటి పర్యంతమయ్యారు. 22 ఏళ్ల క్రితం 2002లో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు పొందిన తమను కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండానే తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తామంతా 50 ఏళ్లు పైబడిన వయస్సులో ఉన్నామని, ఈ వయస్సులో తమకు ఎక్కడా ఉపాధి దొరకదంటూ విలపించారు.

6 నెలలుగా కొనసాగుతున్న తొలగింపులు..

కూటమి సర్కార్ ఏర్పాటైన తర్వాత 6 నెలలుగా వివిధ శాఖల్లోని చిరుద్యోగులను తొలగించడమే పనిగా కొనసాగుతోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటి వరకూ ఒక్క ఉద్యోగం కూడా కల్పించలేదు. రేషన్ డీలర్లు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, వైకేపీ యానిమేటర్లు, మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది, వలంటీర్లు, పాఠశాలల్లో పని చేసే పారిశుద్ధ్య కార్మికులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పారిశుద్ధ్యం పని చేసే కార్మికులు తదితర చిరుద్యోగులను నిర్దాక్షిణ్యంగా తొలగించారు. అమూల్ డెయిరీతో ఒప్పందాన్ని రద్దు చేసి వేలాది మంది యువతకు ఉపాధి లేకుండా చేశారు. అన్యాయానికి గురైన వారు మండల కేంద్రాలు, ఆర్డీఓ కార్యాలయాలు, కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, నిరసనలు వ్యక్తం చేసిన ఫలితం లేకపోయింది. వారి ఆవేదనను కనీసం పరిగణనలోకి కూడా ప్రభుత్వం తీసుకోలేదు.

గత ప్రభుత్వ ఉత్తర్వులు బేఖాతరు..

తొలగించబడిన ఎంపీహెచ్ఏలు దాదాపు 22 ఏళ్లుగా ప్రతి గ్రామం తిరిగి వివిధ రకాల సర్వేలు చేస్తూ వచ్చారు. ఫీవర్ సర్వే, జ్వర లక్షణాలు ఉన్న వారిని ఆసుపత్రులకు రెఫర్ చేయడం, వైద్యం అందించడం, మందులు ఇవ్వడం, రక్తనమూనాలు సేకరించడం, వాటిని ల్యాబ్‌లకు అందజేసి ఫలితాలు అందిపుచ్చుకున్న తర్వాత దగ్గరుండి మందులు అందజేయడం తదితర ఎన్నో విలువైన సేవలందించారు. అంటు, దోమకాటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకున్నారు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకూ హెచ్ఆర్ఏ, డీఏలు ఇవ్వకుండా వెట్టి చాకిరీ చేయించారు. వీరి దుస్థితిని గమనించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2023లో ఎంపీహెచ్ఏలోకు డీఏ, హెచ్ఆర్ఏ ఇవ్వాలని స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను కూటమి సర్కార్ బేఖాతరు చేసింది.

ఎంపీహెచ్ఏల న్యాయ పోరాటం..

2002లో ఉద్యోగాల్లోకి తీసుకున్న ప్రభుత్వం 2012లో జీఓ నంబర్ 273 అమలులో భాగంగా తొలగించారు. అప్పట్లో ప్రభుత్వానికి విన్నవించుకోగా 1207 జీఓ ద్వారా తిరిగి 2017లో కొంత మందిని తీసుకున్నారు. కాగా, ఈ నెల 5న ఏకపక్షంగా ఉమ్మడి జిల్లాలోని 58 మందిని విధుల్లో నుంచి తొలగించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా తొలగింపబడిన వెయ్యి మంది ఎంపీహెచ్ఏలు సుప్రీం కోర్టును ఆశ్రయించారు.

నట్టేట ముంచారు



కరోనా సమయంలో రెండేళ్ల పాటు ప్రాణాలకు తెగించి పేదలకు సేవలందించాం. శాశ్వత ఉద్యోగులు భయాందోళనతో బయటకు రాలేకపోయారు. ఆ సమయంలో మేమే ముందుండి వైద్య సేవలు అందించాం. ప్రమోషన్లు వస్తాయని, హెచ్ఆర్ఏ, డీఏలు వర్తిస్తాయని ఆశించాం అయితే ఊస్టింగ్ ఆర్డర్స్ వస్తాయనుకోలేదు. కూటమి పెద్దలను నమ్మినందుకు నట్టేట ముంచారు.

– మురళి, గుట్టూరు పీహెచ్‌సీ

తీరని అన్యాయం



గ్రామాల్లో పేదలకు 22 ఏళ్లుగా ఎన్నో విలువైన సేవలందించిన మమ్మల్ని తొలగించి కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం చేసింది. 50 ఏళ్లు పైబడిన వయసులో మేము కుటుంబాలను ఎలా పోషించుకోవాలి. వృద్ధులైన తల్లిదండ్రుల అవసరాలు, పిల్లల చదువులకు అవసరమైన డబ్బు ఎలా సమకూర్చుకోవాలి. – అజీజ్‌ఖాన్, పుట్టపర్తి పీహెచ్‌సీ

ఎలా బతకాలి



తొలగించబడిన ఎంపీహెచ్ఏలందరూ 50 ఏళ్లకు పైబడిన వారే. ఈ వయస్సులో ఏ కంపెనీలోనూ ఉద్యోగం రాదు. కుటుంబ పోషణ ఎలా అనేది తీవ్రంగా వేధిస్తోంది. చిరుద్యోగులపై ప్రతాపం చూపడం మంచి పద్ధతి కాదు. – నాగేగౌడ, ఆత్మకూరు పీహెచ్‌సీ

క్లుప్తంగా

పాడి అభివృద్ధే లక్ష్యం

- జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్


పశువుల్లో కృత్రిమ గర్భధారణపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుధాకర్

రొళ్ల: పాడి అభివృద్ధే లక్ష్యంగా పెయ్య దూడల జననంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్, మడకశిర డివిజన్ పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అమర్ పేర్కొన్నారు. రొళ్ల మండలం కె.బ్యాడిగెరలో బుధవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కేవలం పెయ్య దూడలే జన్మించేలా అందుబాటులోకి తీసుకువచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పాడి రైతులను డాక్టర్ సుధాకర్ చైతన్య పరిచారు. పశువులలో చూడి నిర్ధారణ, తిరిగి ఎదకు వస్తూ కట్టకుండా నిలిచి పోయినవి, పూర్తిగా ఎదకు రానివి లాంటి దాదాపు 40 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. 25 ఆవులకు నట్టల నివారణ మందు తాపారు. కార్యక్రమంలో ఏహెచ్ఏలు, జీఎంఎస్‌లు, పాడి రైతులు పాల్గొన్నారు.

కోడెదూడకు మలవాహిక శస్త్ర చికిత్స


శస్త్ర చికిత్స చేస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ పద్మనాభం

శింగనమల: స్థానిక ప్రాంతీయ పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో బుధవారం పశువైద్యాధికారి డాక్టర్ పద్మనాభం ఓ కోడెదూడకు అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. నార్పల మండలం బి.పప్పూరు గ్రామ రైతు జనార్ధన్‌రెడ్డికి చెందిన పాడి ఆవుకు ఇటీవల జన్మించిన కోడెదూడకు మలవాహిక లేదు. విషయాన్ని గుర్తించిన నార్పల పశు వైద్యులు వెంటనే శింగనమల ప్రాంతీయ పశు సంవర్ధక కార్యాలయానికి రెఫర్ చేశారు. పశువైద్యుడు డాక్టర్ పద్మనాభం పరిశీలించి, శస్త్రచికిత్స చేసి మలవాహికను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కోడె దూడ ఆరోగ్యంగా ఉంది. శస్త్రచికిత్సలో అంబులెన్స్ పశువైద్యులు డాక్టర్ సునీత, ట్రైనీ పశువైద్యురాలు నేహా, పారవెట్ ప్రసన్న, గీతా పాల్గొన్నారు.

మిద్దెపై నుంచి జారిపడి మహిళ మృతి


మృతురాలు సత్యమ్మ

హిందూపురం అర్బన్: స్థానిక శ్రీకంఠపురంలో నివాసముంటున్న సత్యమ్మ(45) ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి జారిపడి మృతి చెందింది. బుధవారం ఇంటిపై శుభ్రం చేస్తుండగా అదుపు తప్పి కిందపడిన ఆమెను స్థానికులు వెంటనే జిల్లాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స మొదలుపెట్టే లోపు ఆమె మృతి చెందారు. ఘటనపై వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సమగ్రాభివృద్ధి లక్ష్యాలను సాధించాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్


మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాకు కేటాయించిన సమగ్ర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. అభివృద్ధి పనులపై పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, డ్వామా, సచివాయాలు, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన సమీక్షించారు. ఉపాధి హామీ పథకం అమలు తీరు మెరుగు పడాలన్నారు. దినసరి కూలీల వేతనం రూ.300 చేరుకునేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్, వికలాంగుల పెన్షన్ ధ్రువీకరణ ప్రక్రియ ఈ నెల 28వ తేదీ లోపు పూర్తి కావాలన్నారు. బత్తలపల్లి, ముదిగుబ్బ, ధర్మవరంలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను జనవరి నాటికి పూర్తి చేయాలన్నారు. పుట్టపర్తి, అమడగూరు, తనకల్లు, ఎన్‌పీకుంట, నల్లమాడలో మంజూరైన వివిధ పనుల పురోగతి సరిగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సదరం సర్టిఫికెట్ల జారీ మెడికల్ బోర్డు నిబంధనల మేరకు ఉండాలని, ఉల్లంఘిస్తే సంబంధిత డాక్టర్‌పై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్,, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పీఆర్ ఎస్ఈ మురళీకృష్ణ, డీపీఓ సమత, సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శాంతన్న తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరి లక్ష్మీదేవి కన్నుమూత


చిలుకూరి లక్ష్మీదేవి

అనంతపురం కల్చరల్: సుప్రసిద్ధ కథా రచయిత చిలుకూరి దేవపుత్ర సతీమణి, రచయిత్రి చిలుకూరి లక్ష్మీదేవి (65) కన్నుమూశారు. ఆమె అంత్యక్రియలను బుధవారం అనంతపురంలోని క్రైస్తవ సమాధుల తోటలో నిర్వహించారు. ఆమెకు కుమారుడు అన్వేష్, కుమార్తె దీవెన ఉన్నారు. వీరిద్దరూ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. బుధవారం ఉదయం అనంతపురంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న తన స్వగృహంలో కన్నుమూసిన లక్ష్మీదేవి భౌతిక కాయాన్ని పలువురు రచయితలు, కవులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, సీనియర్ రచయిత డాక్టర్ శాంతినారాయణ, జనప్రియ కవి ఏలూరు యంగన్న తదితరులు మాట్లాడుతూ రచయిత్రిగానే కాకుండా ఉత్తమ సాహితీ అభిమానిగా అనంత సాహితీలోకానికి చిలుకూరి కుటుంబసభ్యులు అందించిన సేవలను కొనియాడారు. జిరసం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్, డాక్టర్ అంకే శ్రీనివాస్, షరీఫ్, చం. శాస్త్రి, రియాజుద్దీన్, రాజారామ్, రామాంజనేయులు, ఐద్వా సావిత్రి, డాక్టర్ ప్రగతి, జేవీవీ డాక్టర్ ప్రసూన, దత్తపీఠం తరఫున డాక్టర్ రామకృష్ణారెడ్డి తదితరులు లక్ష్మీదేవికి నివాళులర్పించారు.

పోలీస్ కేంద్రం.. ఆకతాయిల స్థావరం



టూరిస్ట్ పోలీసు కేంద్రం


పోలీసు కేంద్రం లోపల పడేసిన చెత్తాచెదారం

- పర్యాటకుల భద్రత మరిచిన ప్రభుత్వం
- దుర్వాసన భరించలేకపోతున్న స్థానికులు

లేపాక్షి: పర్యాటకుల భద్రత, సమాచారం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లేపాక్షిలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన టూరిస్ట్ పోలీసు కేంద్రం కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. నంది విగ్రహానికి పది మీటర్ల దూరంలో 2023, ఫిబ్రవరి 14న ప్రారంభించిన ఈ కేంద్రంలో అప్పట్లో ఏఎస్ఐతో పాటు నలుగురు కానిస్టేబుళ్లు రొటేషన్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తూ వచ్చారు. పర్యాటకులకు, భక్తులకు కావాల్సిన సమాచారాన్ని అందజేయడం, వారికి ఏదైనా ఆపద కలిగినా, ప్రమాదం చోటు చేసుకున్నా సకాలంలో స్పందించేవారు. పర్యాటకుల భద్రతే ప్రధానంగా ఎంతో విలువైన సేవలు అందించారు. 8 నెలలుగా ఈ కేంద్రం నిర్వీర్యంగా మారింది. తగిన సిబ్బందిని ప్రభుత్వం కేటాయించకపోవడంతో ఆకతాయిలు తమ స్థావరంగా మార్చుకున్నారు. అక్కడే మద్యం సేవించి, బాటిళ్లను, కర్ణాటక టెట్రా ప్యాకెట్లను పడేస్తున్నారు. ఆ ప్రాంతంలోనే యథేచ్ఛగా మూత్ర, మల విసర్జన చేస్తుండడంతో దుర్వాసన వ్యాపించి చుట్టుపక్కల వారిని ఇబ్బందులకు గురి చేస్తోంది. దీంతో పర్యాటకులు నంది విగ్రహం వద్ద ఎక్కువసేపు ఉండలేకపోతున్నారు. నిరుపయోగంగా ఉన్న ఈ కేంద్రాన్ని పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చొరవ తీసుకోవాలంటూ ఉన్నతాధికారులకు విన్నవించనున్నట్లు లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ తెలిపారు. టూరిస్ట్ పోలీస్ కేంద్రం దుస్థితిపై ఉన్నతాధికారులకు ఇప్పటికే నివేదిక ఇచ్చామని, త్వరలో సిబ్బందిని కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ తెలిపారు.

రైల్వే పోలీసులకు రాష్ట్రస్థాయి అవార్డు


డీజీపీ ద్వారక తిరుమలరావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న గుంతకల్లు రైల్వే డివిజన్ ఎస్పీ, అధికారులు

అనంతపురం సిటీ: గుంతకల్లు రైల్వే డివిజన్ పోలీసులకు రాష్ట్ర స్థాయి అవార్డు దక్కింది. విజయవాడలో బుధవారం జరిగిన కార్యక్రమంలో డీజీపీ ద్వారక తిరుమలరావు నుంచి గుంతకల్లు రైల్వే డివిజన్ ఎస్పీ మీనా, ఇతర అధికారులు అవార్డు అందుకున్నారు. అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్, నేర పరిశోధనలో ప్రతిభ చాటిన అంశానికి సంబంధించి గుంతకల్లు రైల్వే డివిజన్‌కు ద్వితీయ స్థానం దక్కింది. ఈ క్రమంలో అవార్డును డీజీపీ అందజేశారు. అవార్డు అందుకున్న వారిలో గుంతకల్లు రైల్వే డివిజన్ ఎస్పీ మీనా, ఇన్‌చార్జ్ డీఎస్పీ హర్షిత, ధర్మవరం పూర్వపు సీఐ నాగరాజు, ప్రస్తుత సీఐ అశోక్‌కుమార్, గుంతకల్లు సీఐ నగేశ్‌బాబు, హిందూపురం రైల్వే ఎస్ఐ బాలాజీ నాయక్, హెడ్‌కానిస్టేబుళ్లు డి.రాజశేఖరరెడ్డి, శ్రీనివాసులు, కానిస్టేబుల్ జగదీశ్(అనంతపురం), గిరిప్రసాద్(హిందూపురం) ఉన్నారు.

ప్రభుత్వాల వైఖరితో విద్యా వ్యవస్థ నాశనం

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న
- ఘనంగా ముగిసిన ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు

గుత్తి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో విద్యా వ్యవస్థ సర్వ నాశనమవుతోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. గుత్తి శివారులోని మాసినేని ఉన్నత పాఠశాలలో బుధవారం రెండో రోజూ ఎస్ఎఫ్ఐ 32వ జిల్లా మహాసభలు ముగిశాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తల్లికి వందనం, విద్యా దీవెన అమలుకు నోచుకోక విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారన్నారు. ఆధార్, బర్త్ సర్టిఫికెట్ల కరెక్షన్ పేరుతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఈ ప్రభుత్వాలు ముప్పతిప్పలు పెడుతున్నాయన్నారు. కరెక్షన్ కార్యక్రమాలను పాఠశాలలు, కళాశాలల్లో చేపట్టకుండా డబ్బు కోసం ఆధార్ కేంద్రాలు, మీసేవా కేంద్రాల్లో చేస్తున్నారని ఆరోపించారు. నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు జీఓ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని, విద్యా వ్యవస్థను మెరుగు పరచాలని డిమాండ్ చేశారు. విద్యా రంగ, విద్యార్థుల సమస్యలపై దశలవారీగా పోరాటాలు, ఉద్యమాలు చేస్తామన్నారు.

జిల్లా నూతన కమిటీ ఎంపిక

ఈ సందర్భంగా మొత్తం 25 మందితో కూడిన ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా సిద్ధు, ప్రధాన కార్యదర్శిగా ఓతూరు పరమేష్, ఆఫీస్ బేరర్స్‌గా సి. రమేష్, వంశి, గిరి, శివ, రజిత, భీమేష్, వెంకి, సూర్య, కమిటీ సభ్యులుగా ధను, బాలాజీ, సోము, వీరేష్, మహేష్, జాకీర్, గౌతమ్ తదితరులు ఎంపికయ్యారు.

రైలు నుంచి జారి పడి బీటెక్ విద్యార్థి మృతి

ధర్మవరం రూరల్: మండలంలోని మల్లేనిపల్లి సమీపంలో రైలు నుంచి జారిపడి ఓ విద్యార్థి మృతి చెందాడు. వివరాలు... ధర్మవరం మండలం పోతుకుంట గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి, సుధమ్మ దంపతుల కుమారుడు నిఖిల్‌కుమార్‌రెడ్డి (21) చెన్నైలోని ఓ కళాశాలలో మొదటి సంవత్సరం బీటెక్ చదువుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి స్వగ్రామానికి రైలులో బయలుదేరాడు. బుధవారం తెల్లవారుజామున మల్లేనిపల్లి వద్ద ప్రయాణిస్తుండగా టాయిలెట్‌కని వెళ్లిన నిఖిల్... నిద్రమత్తులో బాతురూం తలుపు అనుకుని రైలు బోగీ డోర్ తెరిచి అడుగు ముందుకేయడంతో కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన నిఖిల్‌కుమార్‌రెడ్డి తన సెల్‌ఫోన్‌ను తీసి విషయాన్ని తండ్రికి తెలుపుతూ లోకేషన్ షేర్ చేశాడు. దీంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని నిఖిల్‌కుమార్‌రెడ్డిని వెంటనే అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక సాయంత్రం ఆయన మృతి చెందాడు.

వేధింపుల కేసులో ముద్దాయికి ఏడాది జైలు



అనంతపురం: భార్యను వేధించిన కేసులో భర్తకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ అనంతపురం కోర్టు తీర్పు వెలువరించింది. వివరాలు... అనంతపురంలోని ఎర్రనేల కొట్టాలలో నివాసం ఉంటున్న బత్తల శైలజ, బత్తల సురేంద్రబాబు అలియాస్ సూరి దంపతులు. పెళ్లి సమయంలో సురేంద్రబాబుకు వరకట్నం కింద రూ.లక్ష, 8 తులాల బంగారు నగలను శైలజ తల్లిదండ్రులు ఇచ్చారు. అనంతరం రూ.1.50 లక్షల అదనపు కట్నం తీసుకు రావాలంటూ శైలజను శారీరకంగా వేధిస్తూ వచ్చాడు. వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో 2019లో అనంతపురం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. దీనిపై ఎస్ఐ నాగమధు అప్పట్లో కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. ఈ కేసు వాదనలు అప్పటినుంచి కొనసాగుతూ వచ్చాయి. కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం నేరం రుజువు కావడంతో ముద్దాయి బత్తల సురేంద్రబాబుకు ఏడాది జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ మొబైల్ జడ్జి జె.సుజిన్ బుధవారం తీర్పు వెలువరించారు. కేసులో ప్రాసిక్యూషన్ తరఫున వాదనలను ఏపీపీ వి.శ్రీనివాసులు వినిపించారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం


నూతన జనరేటర్‌ను ప్రారంభిస్తున్న ఆర్.జె.రత్నాకర్‌రాజు

ప్రశాంతి నిలయం: సత్యసాయి వైద్య సంస్థల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్‌రాజు తెలిపారు. ప్రశాంతిగ్రాంలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన 1010 కేవీ జనరేటర్‌ను బుధవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. వైద్య సంస్థలో విద్యుత్ అంతరాయం లేకుండా రోగలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రూ.95 లక్షల వ్యయంతో జనరేటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిమ్స్ డైరెక్టర్ డాక్టర్ గురుమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహితపై అత్యాచారయత్నం

గాండ్లపెంట: మండలంలోని మలమీదపల్లి పంచాయతీ బనాన్‌చెరువుపల్లిలో ఓ వివాహితపై ఈ నెల 16న స్థానికుడు అత్యాచారయత్నం చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన ఓ వివాహిత తన పొలం వద్ద పనుల్లో నిమగ్నమైన సమయంలో అదే గ్రామానికి చెందిన మల్లికార్జున తన కోరిక తీర్చాలంటూ బలాత్కారానికి చేయబోయాడు. ఆ సమయంలో ఆమె గట్టిగా కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయాడు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ అనంతరం మల్లికార్జునపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రంగానాయక్ తెలిపారు.

పట్టు పురుగులపై విష ప్రయోగం


చంద్రికల్లోనే చనిపోయిన పట్టు పురుగులు

మడకశిర రూరల్: మండలంలోని గుర్రపుకొండ గ్రామంలో పట్టు పురుగులపై విషప్రయోగం జరిగింది. మూడు రోజుల క్రితం మల్బరీ షెడ్‌లోకి ప్రవేశించిన దుండగులు విష ప్రయోగానికి పాల్పడినట్లు బాధిత రైతులు నాగరాజు, ఈరన్న బుధవారం అనుమానం వ్యక్తం చేశారు. 200 గుడ్ల పట్టు పురుగుల పెంపకాన్ని తాము చేపట్టామని, పంట దిగుబడి కూడా వచ్చిందని తెలిపారు. గూళ్ల అల్లికకు చంద్రికల్లో వదిలిన సమయంలో కొన్ని చంద్రికలపై విష ప్రయోగం చేయడంతో పురుగులు చనిపోయాయన్నారు. మిగిలిన చంద్రికల్లోని పురుగులు గూళ్లు అల్లుకున్నాయన్నారు. విష ప్రయోగం కారణంగా రూ.50 వేలకు పైగా నష్టం జరిగిందన్నారు.

కిడ్నాప్ యత్నం విఫలం

తలుపుల : బాలిక కిడ్నాప్ యత్నం విఫలమైంది. బాలిక కేకలు విని స్థానికులు కిడ్నాపర్‌ను పట్టుకుని దేహశుద్ధి చేశారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఓబీఆర్ కొత్తపల్లికి చెందిన మహిళ తన ఏడేళ్ల కుమార్తెతో కలిసి బ్యాంకు పనిమీద బుధవారం తలుపులకు వచ్చింది. బస్టాండ్‌లో బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తుండగా వైఎస్సార్ జిల్లా చక్రాయపేట మండలం నాగులగుట్టపల్లికి చెందిన ఓబులేసు అదును చూసి బాలికను తీసుకుని పూలబజార్ వైపు మీదుగా కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించాడు. అపరిచిత వ్యక్తిని చూసి భయపడిపోయిన బాలిక గట్టిగా కేకలు వేసింది. దీంతో స్థానికులు కిడ్నాపర్‌ను పట్టుకుని దేహశుద్ధి చేసి, పోలీసులకు స్వాధీనం చేశారు. అనంతరం బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఓబులేసుపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపుతామని ఎస్ఐ నరసింహుడు తెలిపారు.

యువకుడి దుర్మరణం

గోరంట్ల: కేఎస్ ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... పుట్టపర్తి మండలం పెడపల్లి గ్రామానికి చెందిన మహేష్‌నాయక్ (22), రాజేష్‌నాయక్ బుధవారం వ్యక్తిగత పనిపై గోరంట్లకు వచ్చారు. పని ముగించుకున్న అనంతరం రాత్రి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన వారు గుంతపల్లి సమీపంలోని ఓ గార్మెంట్స్ పరిశ్రమ వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొంది. మహేష్ నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన రాజేష్‌నాయక్‌ను 108 వాహనంలో స్థానికులు గోరంట్లలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం బెంగళూరులోని ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు.

పాడి ఆవుపై చిరుత దాడి

చిలమత్తూరు: మండలంలోని ఆదేపల్లి గ్రామ సమీపంలో మేత మేస్తున్న పాడి ఆవుపై చిరుత దాడి చేసింది. బుధవారం ఉదయం ఆవు గట్టిగా అరవడంతో రైతు ఆదినారాయణప్ప అక్కడకు చేరుకున్నాడు. ఆ సమయంలో ఆమె మెడను చిరుత కరుస్తూ కనిపించడంతో గట్టిగా కేకలు వేశాడు. దీంతో చిరుత సమీపంలోని కనుమ ఎర్రకొండ అటవీ ప్రాంతంలోకి పరుగు తీసింది. విషయంలో తెలుసుకున్న స్థానికులు చిరుత సంచారంపై ఆందోళన వ్యక్తం చేశారు.

'అనంత'లో కూచ్‌బెహర్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్

అనంతపురం: బీసీసీఐ, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న కూచ్ బెహర్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ను అనంతపురంలోని ఆర్డీటీ క్రీడామైదానంలో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర జట్ల మధ్య క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ నెల 20న అనంతపురానికి ఇరు జట్ల క్రీడాకారులు చేరుకోనున్నారు. 20, 21 తేదీల్లో ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొంటారు. ఏపీ జట్టులో ప్రాతినిధ్యం వహిస్తున్న కేహెచ్ వీరారెడ్డి, ఎ.జయంత్‌కృష్ణ జిల్లా వాసులు కావడం గమనార్హం.